

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

సమస్యలను పరిష్కరిస్తాం: ఎస్పీ

నంద్యాల టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చట్ట పరిధికి లోబడి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి ఫిర్యాదులు 93 వచ్చాయి. నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీహాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 207దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులను సరిగా రెడ్రస్ చేయని కారణంగా 77 దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యాయని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయసేకరణకు సంబంధించి 4 సచివాలయాలు ఇంతవరకు అభిప్రాయ సేకరణ చేపట్టకపోవడానికి గల కారణాలు ఏమిటని కలెక్టర్ ప్రశ్నించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

'రెడ్‌క్రాస్' రక్తనిల్వ కేంద్రం ప్రారంభం

నంద్యాల హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని నీటిపారుదల శాఖ కార్యాలయ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిల్వ కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రులు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా కేంద్రం అయిన తర్వాత జిల్లా ఆస్పత్రి స్థాయి పెరిగిందని, రోగులు అత్యధికంగా చికిత్స కోసం నంద్యాలకు వస్తుండటంతో రక్త నిల్వ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. గతంలో ప్రతి అవసరానికి కర్నూలుకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం నంద్యాలలో అన్ని వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన రక్తాన్ని నిల్వ ఉంచేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. రక్తం నిల్వ ఉంచేందుకు అవసరమైన సామగ్రి కోసం కలెక్టర్ రాజకుమారి రూ.12లక్షలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లేశ్వరి, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సాగు కష్టమే...!



చాగలమర్రి సమీపంలో దెబ్బతిన్న కేసీ ప్రధాన కాలువ

కేసీ కెనాల్ కాలువ కర్నూలు, కడప జిల్లాలకు సాగు, తాగునీరు అందించే పథకం. గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేసీ కెనాల్ కాలువలను మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పంట కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చివరి ఆయకట్టు రైతులకు చుక్కనీరు కూడా అందని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవేళ నీరు విడుదల చేసినా గండ్లు ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అయినా తమపై దయ ఉంచాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

- ఆందోళనలో చివరి ఆయకట్టు రైతులు
- శిథిలావస్థలో కేసీ కెనాల్ పంట కాలువలు
- దెబ్బతిన్న లైనింగ్, రక్షణ గోడలు
- నిధుల గ్రహణంతో ఆగిన పనులు
- ఆరుతడి పంటలపైనే అన్నదాతల ఆశలు

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు రైతులకు చుక్కనీరు అందడం కూడా గగనమైపోతోంది. కేసీ పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. నిధుల గ్రహణంతో పనులు ఆగిపోయాయి. ఫలితంగా చివరి ఆయకట్టుకు చుక్క నీరు పారని దుస్థితి నెలకొంది. దీంతో రైతాంగం ఆరు తడి పంటలపైనే దృష్టి సారించాల్సిన దుస్థితి నెలకొంది. వైసీపీ పాలనలో ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టలేదు. ప్రతి ఏడాది నామమాత్రంగా పనులు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైన కేసీ ప్రధాన కాలువ లైనింగ్ పనులు, పంట కాలువల పనులు చేపట్టి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకుంటారని రైతులు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో కేసీ కాలువ పరిస్థితి ఇలా..

ఆళ్లగడ్డ సబ్‌డివిజన్‌లో కేసీ కాలువ 177 కిలోమీటర్ నుంచి 234 కి.మీ వరకు ఉంది. ఈ కాలువ ఆయకట్టు 39,138 ఎకరాలు ఉండగా నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, రుద్రవరం రైతులు కేసీ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడి ప్రాంతాల్లో సాగుకు కేసీ కాలువ నీరే ఆధారం. అలాంటిది అడుగడుగున అడ్డంకులు ఉండటంతో చివరి ఆయకట్టుకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. నంద్యాల జిల్లాలో మొత్తం ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఇందులో 1.65 లక్షల ఎకరాలకు కేసీ కెనాల్ నీరే ఆధారం. అలాంటి కేసీ కెనాల్ చాలా చోట్ల శిథిలమైపోయింది. ప్రతి ఏటా తాత్కాలిక పనులు చేసి సరిపెడుతున్నారు.

మండలాల వారీగా ఆయకట్టు

ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని చాగలమర్రి మండలంలో 8,917 ఎకరాలు, ఆళ్లగడ్డ మండలంలో 23,574 ఎకరాలు, దొర్నిపాడు మండలంలో 13,500 ఎకరాలు, ఉయ్యాలవాడ మండలంలో 12,108, రుద్రవరం మండలం 254 ఎకరాల ఆయకట్టు ఉంది.

గండ్లు పడే ప్రమాదం..

కొన్నేళ్లుగా లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. కేసీ ప్రధాన కాలువ లైనింగ్ దెబ్బతింది. కాలువకు పూర్తిస్థాయిలో నీరు వదిలితే గండ్లు పడే ప్రమాదముంది. చివరి ఆయకట్టుకు నీరు అందకపోవడంతో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారిస్తున్నారు. మూడేళ్ల నుంచి కేసీ కాలువ మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో కాలువలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి.

ప్రతిపాదనలకే సరి..

కేసీ కెనాల్ మరమ్మతులకు నిధులు ప్రతిపాదనలకే సరిపెడుతున్నారు. మూడేళ్ల నుంచి నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టడం లేదు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తిరిగి పనులు చేసేందుకు ముందుకు రాలేకపోతున్నారు. దీంతో కేసీ కాలువ ఆయకట్టు పరిస్థితి దయనీయంగా మారింది. కేసీ కెనాల్ మరమ్మతుల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

బీడుభూములుగా..

ఆళ్లగడ్డ పరిధిలోని కేసీ ప్రధాన కాలువ 27వ లాక్ నుంచి రెండు అడుగుల నీరు మాత్రమే ఏటా ప్రవహిస్తోంది. దిగువకు నీరు ప్రవహించడం లేదు. దీంతో ఆయా గ్రామాల రైతులు సాగునీరు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చాగలమర్రి పరిసరాల్లో కేసీ పంట కాలువల్లో మురికి నీరు కూడా ప్రవహిస్తోంది. దీంతో వరి పంట సాగు చేసుకోలేక రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించారు. కొందరు రైతులు పంటలు సాగు చేసుకోకుండా బీడు భూములుగా వదిలేస్తున్నారు.



కూలూరు రహదారిలో ముళ్ల కంపలతో నిండుకున్న స్ట్రక్చర్

సాగుకు నీరందడం లేదు



కేసీ కాలువ కింద నాలుగెకరాల పొలం ఉంది. వరి పంట సాగుకు నీరందడం లేదు. పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేసుకుంటున్నాం. ప్రతి ఏడాది కేసీ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం.

- మాబుబాషా, రైతు, చాగలమర్రి

మురుగు నీరు ప్రవహిస్తోంది



కేసీ ఆయకట్టు భూముల్లో మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో పంటలు సాగు చేయలేకపోతున్నాం. మురుగు నీరు ప్రవహించకుండా పంట కాలువల ద్వారా సాగునీరు అందేలా చూడాలి. కాలువలు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలి.

- శివుడు, రైతు, చాగలమర్రి

ప్రతిపాదనలు పంపించాం

కేసీ ప్రధాన, పంట కాలువల పూడికతీత పనులు చేయడానికి ఈ ఏడాది రూ.30 లక్షలతో పలుచోట్ల పనులు చేసేందుకు ప్రతిపాదనలు కూడా పంపించాం. పంట కాలువలతో పాటు కేసీ ప్రధాన కాలువ లైనింగ్ పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశాం. ఈ ఏడాది నిధులు మంజూరైతే తక్షణమే పనులు చేపడతాం.

- జమాల్‌వలి, ఏఈ, కేసీ కెనాల్



రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఫరూక్, జనార్దన్‌రెడ్డి

రూ.500 కోట్లతో బనగానపల్లెకు పైపులైన్: మంత్రి బీసీ

బనగానపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ నుంచి బనగానపల్లెకు రూ.500 కోట్లలో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. జలజీవన్ మిషన్ కింద సోమవారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో రూ.35.60లక్షలతో, రాళ్లకొత్తూరులో 31.50లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇల్లూరు కొత్తపే, రాళ్లకొత్తూరు తండాల్లో తాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ డీఈ వేణుగోపాల్, ఏఈ సాయికృష్ణను ఆదేశించారు. ఈ సందర్భంగా మహిళలు తమ వీధుల్లో వాటర్‌పైపులు పగిలిపోయి ఉన్నాయని దీంతో ఐదేళ్లగా తాగునీరు సక్రమంగా రావడంలేదని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. వారంలోగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఇల్లూరుకొత్తపేటలో స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. రాళ్లకొత్తూరు తండా ప్రజలు కమ్యూనిటీ హాల్‌కావాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా ఐటీడీఏ కింద ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ట్యాంకులను తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి చేశామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అన్నింటిని దశల వారీగా అమలు చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఇల్లూరు కొత్తపేట మాజీ సర్పంచ్ రామిరెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్, బాలనాయుడు, మహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పేట్ల శేఖర్, బాలుడు, మొలక కృష్ణుడు పాల్గొన్నారు.



ఇల్లూరు కొత్తపేటలో జలజీవన్ మిషన్ కింద నిర్మించిన తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

విజన్ ఉంటేనే అభివృద్ధి : మంత్రి భరత్

ఓర్వకల్లు- గుట్టపాడు ఎంఎస్ఎంఈ ప్రారంభం

ఓర్వకల్లు, మే 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు పెట్టాలంటే విజన్ తప్పనిసరిగా ఉండాలని పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆ విజన్ సీఎం చంద్రబాబు నాయుడుకు ఉందని, ఆయన సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వెళ్తోందన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామం వద్ద రూ.38.47 కోట్లతో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు 60 శాతం మార్కులు వస్తేనే ఎక్కువ అనుకునేవాళ్లు అని ఇప్పుడు 99 శాతం మార్కులు వస్తున్నాయన్నారు. అదేవిధంగా సరైన శిక్షణ, చదువు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయన్నారు. ఓర్వకల్లులో పైలట్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దూపాడు-బేతంచెర్ల రైల్వే స్లైడింగ్‌కు అనుమతులు వస్తున్నాయన్నారు. అనంతపురం-కర్నూలు ఇండస్ట్రియల్ జోన్‌కు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ 2014లో ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఓర్వకల్లు మండలాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దారనీ, ఎయిర్‌పోర్టు, డీఆర్‌డీవో, జయరాజ్ ఇస్పాత్, సోలార్ పార్కు వంటి పరిశ్రమలు తీసుకువచ్చారని అన్నారు. ప్రస్తుతం 300 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్

ఆస్తమానం ఇబ్బందులే..!

- ఆస్తమాను ముందే గుర్తించాలి..
- మందులతో చికిత్స
- నేడు వరల్డ్ ఆస్తమా డే

7

గుంతల రోడ్లకు మోక్షం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రహదారి మరమ్మతులకు నిధులు
- ఆర్‌అండ్‌బీకి రూ. 61.90 కోట్లు మంజూరు
- పీఆర్‌కు రూ. 39.83 కోట్లు ● త్వరలో టెండర్ల స్వీకరణ
- ఐదేళ్లపాటు రోడ్లను విస్మరించిన వైసీపీ సర్కార్



పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నంద్యాల, మే 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పల్లె పట్టణం అనే తేడా లేకుండా రహదారుల నిర్వహణ గాలికి వదిలేసింది. గత ఐదేళ్ల పాటు నిధులు ఆశించిన స్థాయిలో మంజూరు చేయకుండా పూర్తిగా విస్మరించింది. దీంతో ఎక్కడిక్కడ రహదారులు అధ్వాన స్థితికి చేరాయి. తద్వారా సదరు రహదారుల్లో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా గత సర్కార్ ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. విడతల వారీగా రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయడం చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరోమారు.. కర్నూలు, నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు రూ.101.73 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నిధులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ పరంగా.. రూ. 61.90 కోట్లతో 171.03 కిలోమీటర్లు, పంచాయతీరాజ్‌శాఖ పరంగా.. రూ. 39.83 కోట్లతో 88.46 కిలోమీటర్ల మేర మరమ్మతులు త్వరలో చేయనున్నారు. ఇదే క్రమంలో త్వరలో ఆయా శాఖల నేతృత్వంలో టెండర్లు పిలవనున్నట్లు ఆశాఖ అధికారులు తెలియజేశారు. ఏది ఏమైనా ఉమ్మడి జిల్లాలోని దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడంతో ఎట్టకేలకు గుంతల రోడ్లకు మోక్షం కలిగినట్లైంది.

రహదారులకు మరమ్మతులు

ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లలో రోడ్లను గత వైసీపీ సర్కార్ ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో సదరు రహదారులు పూర్తిగా దెబ్బతిని సదరు రహదారుల గుండా ప్రయాణం చేయాలంటే నరకం కనబడేది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల పరంగా వేరువేరుగా నిధులు మంజూరు చేసింది.



కర్నూలు జిల్లాలో....

- ఆర్‌అండ్‌బీకి మంజూరైన నిధులు : రూ.18.80 కోట్లు
- చేయాల్సిన మరమ్మతులు: 47.62 కిలోమీటర్లు
- పంచాయతీరాజ్ శాఖకు మంజూరైన నిధులు : రూ.19.68 కోట్లు
- చేపట్టాల్సిన మరమ్మతులు: 43 కిలోమీటర్లు

నంద్యాల జిల్లాలో...

- ఆర్‌అండ్‌బీకి మంజూరైన నిధులు : రూ.43.10 కోట్లు
- చేయాల్సిన మరమ్మతులు : 123.41 కిలోమీటర్లు
- పంచాయతీ రాజ్‌శాఖ మంజూరైన నిధులు: రూ.20.15 కోట్లు
- చేయాల్సిన మరమ్మతులు : 45.46 కిలోమీటర్లు

మిగతా 7వ పేజీలో

ఈశ్రమ్ కార్డులతో ప్రయోజనాలు

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఈశ్రమ్ కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, ప్రతి కార్మికుడు కార్డులను పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. సోమవారం నగరంలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని, వాటి ద్వారా కార్మికులు హెల్త్ ఇన్సూరెన్స్, బీమా వసతిలతో పాటు ఇతర ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. డీఎంహెచ్‌వో పి.శాంతికళ మాట్లాడుతూ తమ శాఖలోని ఆశావర్కర్లు అందరూ ఈశ్రమ్ కార్డులు పొందారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈశ్రమ్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలి? పాటించాల్సిన నిబంధనలు, మొదలైన అంశాలను వివరించారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పథకాలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద రూ.2 లక్షలు ప్రమాద మరణ బీమా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్టుమెంట్ లీగల్ ఆఫీసర్ సుమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడు

సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు, వీడియోలు వైరల్

కోసిగి, మే 5 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలానికి చెందిన ఓ బాలికను ఓ యువకుడు వివాహం చేసుకున్నాడు. పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో రావడంతో వైరల్‌గా మారింది. వివరాలివీ.. తన 16 ఏళ్ల కుమార్తెను మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై అనుమానం వ్యక్తం చేస్తూ కోసిగి మండలానికి చెందిన బాలిక తండ్రి ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కోసిగి ఎస్‌ఐ హనుమంతరెడ్డి అదృశ్యం కేసు నమోదు చేశారు. అయితే రచ్చుమర్రి గ్రామానికి ఓ యువకుడు బాలికను కర్ణాటక ప్రాంతానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్న వీడియోలు సోమవారం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టాయి. కోసిగి పోలీసులను వివరణ కోరగా.. విచారిస్తామని చెప్పారు.

గుంతల రోడ్లకు మోక్షం



(5వ పేజీ తరువాయి)

దీంతో పల్లె పట్టణం అనే తేడా లేకుండా రహదారుల మరమ్మతులు చేయనున్నారు.

ఇది వరకే గుంతల రోడ్లకు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రోడ్ల మరమ్మతులకు ఇదివరకే నిధులు మంజూరు చేసి పనులు చేసిన విషయం తెలిసిందే. అయితే.. గుంతలు పూడ్చినా.. సాఫీగా ప్రయాణం చేసేందుకు అవకాశం లేని వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు (రెన్యువల్) నిధులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ పరిధిలోని 171.03 కిలోమీటర్ల మేర రోడ్ల పనులు పూర్తి చేసేందుకు రూ.61.90 కోట్లు (నాబార్డ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(ఆర్‌ఐడీఎఫ్) కింద నిధులు మంజూరు చేసింది.

పంచాయతీరాజ్ శాఖకు నిధులు

ఉమ్మడి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఇప్పటికే పల్లె పండుగ కింద రూ. కోట్ల నిధులు మంజూరు చేసి గ్రామీణ రహదారుల పనులు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. 88.46 కిలోమీటర్లు మరమ్మతులు చేసేందుకు రూ. 39.83 కోట్లు(నాబార్డు కింద) నిధులు మంజూరు చేశారు.

త్వరలో టెండర్లు

గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో రూ. కోట్ల నిధులు రోడ్ల మరమ్మతుల కోసం మంజూరు చేయడం గమనార్హం. దీంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని రోడ్ల దశ మారనుంది. పైగా రోడ్లు భవనాల శాఖ మంత్రి సొంత జిల్లా కావడం మరింత కలిసి వచ్చినట్లైంది. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు కూడా ఈ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. త్వరలోనే టెండర్లు పిలిచి త్వరితగిన పనులు పూర్తి చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ పాలనలో నరకం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ సర్కార్ రహదారుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజలు అవస్థల నడుమ ప్రయాణం చేయాల్సిన దుస్థితి. కొత్త రోడ్ల సంగతి అటు ఉంచితే.. కనీసం గుంతలను కూడా పూడ్చింది లేదు. ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరంగా అరకొర నిధులు నిధులు కేటాయించి మమ అనిపించారు. దీంతో ఎక్కడా కూడా ఆశించిన స్థాయిలో పనులు సాగలేదు. పైగా వచ్చిన పనులకు కూడా బిల్లులు సకాలంలో చేయకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు సైతం పనులు చేయకుండా మొండికేశారు. మొత్తమ్మీద ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో రహదారులు మరింత అధ్వానంగా మారి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించినట్లైంది. ఇదిలా ఉండగా..చేసిన అరకొర పనులకు సైతం గత వైసీపీ సర్కార్ రూ. కోట్లలో బిల్లులు పెండింగ్ పెట్టిందని బాధిత కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

నిధులు రావడం శుభపరిణామం

తాజాగా ఆర్‌ఐడీఎఫ్ కింద ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్ల మరమ్మత్తులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం శుభపరిణామం. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ పనుల పరంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

-ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి

త్వరలో టెండర్లు పిలుస్తాం

నాబార్డు కింద ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరగా ఎస్టిమేట్స్ తయారు చేసి ఈ నెల ఆఖరుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. వచ్చే మూడు నెలల్లో పనున్నీ పూర్తి చేస్తాం. ప్రభుత్వం పల్లె రోడ్ల పనులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిధులు మంజూరు చేయడం ప్రజలకు ఎంతో దోహదపడుతుంది.

- పీఆర్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి

ఆస్తమానం ఇబ్బందులే..!



- సమస్యను ముందే గుర్తించాలి..
- మందులతో చికిత్స
- నేడు వరల్డ్ ఆస్తమా డే

కర్నూలు హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం బీపీ, మధుమేహంతో పాటు ఆస్తమా కూడా ప్రజానీకాన్ని వేధిస్తోంది. కలుషిత వాతావరణం, ఆహారపు అలవాట్లు, దీర్ఘకాలికంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు, రసాయనాలకు గురికావడం వంటివి కూడా ఆస్తమాకు దారితీస్తాయి. బాధితుల్లో శ్వాసపరమైన ఇబ్బందులు, ఛాతీ బిగుతుగా అనిపించడం, కఫం, ఊపిరితిత్తుల్లో నొప్పి వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. దీనికి వైద్యపరంగా తగిన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. క్రమం తప్పకుండా వైద్యసలహాలు పాటిస్తే ఆస్తమాను చాలా వరకు నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే రోగులకు మందులపై సరైన అవగాహన లేకపోవడం, జబ్బు మీద అపోహలు, భయాలు నెలకొనడం పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆస్తమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13 శాతం మంది దీంతో బాధపడుతుండగా.. ఆస్తమా మరణాల్లో 42 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఆస్తమాపై అవగాహన పెంచేందుకు గ్లోబల్ ఇన్‌షియేటివ్ ఫర్ ఆస్తమా, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది మే మొదటి మంగళవారం వరల్డ్ ఆస్తమా డే నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'ఇన్‌హేలర్ ట్రీట్‌మెంట్ అందరికీ అందుబాటులో ఉండేలా చేయండి అన్ని నినాదం ఇచ్చింది.

ఇన్‌హేలర్లపై అనుమానం వద్దు

ఇన్‌హేలర్లు సురక్షితం. ఆందోళన, అనుమానాలు వద్దు. ఆస్తమా చాలా తీవ్రంగా ఉంటేనే చివరి దశలోనే ఇన్‌హేలర్లు వాడుతారనీ అనుకోవద్దు. ఇన్‌హేలర్‌లో తీసుకునే మందు మోతాదు, మైక్రో గ్రాముల్లో ఉంటుంది. ఇది నేరుగా శ్వాస మార్గాల్లోకి చేరుకుంటుంది. ఇన్‌హేలర్ల వాడకంపై ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌ఓ ప్రాధాన్యత ఇచ్చింది. పిల్లల విషయంలో ఇన్‌హేలర్ల వాడకంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదు. స్టెరాయిడ్ల వాడకంతో పిల్లల ఎదుగుదల కుంటు పడుతుందని భయపడుతుంటారు. ఇది తప్పు. ఆస్తమా నియంత్రణలో లేకపోతేనే ఎదుగుదల దెబ్బతింటుంది. ఇన్‌హేలర్లు ఖరీదైనవే కావొచ్చు. కానీ వీటిని సరిగ్గా వాడకపోవడం వల్ల ఆసుపత్రికి చేరితే అయ్యే ఖర్చుతో పదేళ్లకు సరిపడిన ఇన్‌హేలర్ మందులు కొనుక్కోవచ్చు. ఇన్‌హేలర్‌కు స్పేసర్‌ను జోడించి మందు పీల్చుకోవడం అన్ని విధాలుగా మంచిదని వైద్యనిపుణులు చెబుతున్నారు.

పరీక్షలు

ఆస్తమా నిర్ధారణకు స్పైరో మెట్రి ప్రామాణిక పరీక్ష. గట్టిగా శ్వాస తీసుకుని స్పైరో మీటర్ గొట్టం లోనికి గాలికి ఊదడం ఇందులో కీలకాంశం. పీక్‌ఫ్లో మీటర్ అనేది గాఢంగా గాలి పీల్చుకుని దీని గొట్టంలోకి గట్టిగా ఊదితే ఊపిరితిత్తుల నుంచి గాలి ఎంత బలంగా బయటకు వస్తుందనేది బయటపడుతుంది. ఇది మందులు వేసుకుంటున్నప్పుడు ఎలా పని చేస్తున్నాయా తెలుసుకోవచ్చు. ఆస్తమా బాధితులకు ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ అవుతుంది. క్షయ, సీవోపీడీ, న్యూమోనియా, క్యాన్సర్, లంగ్ డిసీజ్, వంటి సమస్యల్లో దగ్గు ఉంటుంది. అందువల్ల ఎక్స్‌రే తీసి చూడటం మంచిది.

ఓపీకి 10 శాతం మంది రోగులు



కర్నూలు జీజీహెచ్‌కు ప్రతి రోజు ఊపిరితిత్తుల విభాగానికి 100 నుంచి 120 మంది రోగులు వస్తుంటారు. ఇందులో పది శాతం ఆస్తమా రోగులు, దగ్గు పిల్లికూతలు పని చేయకపోవడం, చాతి బిగుతుగా ఉండటం లక్షణాలతో వస్తుంటారు. ఆసుపత్రిలో రోగులకు ఇన్‌హేలర్ థెరపీ, నెబులైజర్ ద్వారా, మందులతో మెరుగైన చికిత్స అందిస్తున్నాం. నిరంతరం దగ్గు, ఆయాసం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.


- డాక్టర్ అంబర్‌నాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఊపిరితిత్తుల విభాగం, కర్నూలు జీజీహెచ్

ఇన్‌హేలర్లు సురక్షితం



ఆస్తమా రోగులకు ఇన్‌హేలర్లు సురక్షితమైనవి. ఇన్‌హేలర్ల వాడకంపై ఎలాంటి అనుమానాలు వద్దు. కొందరికి ఆయా కాలాల్లో ఆయా పరిస్థితుల్లో ఆస్తమా ఎక్కువవుతుంది. కొందరికీ ఏసీ, కొన్ని రకాల పదార్థాలు పడకపోవచ్చు. ఇలాంటి అలర్జీ కారణాలకు దూరంగా ఉండే ఆస్తమాను నియంత్రించవచ్చు. వైద్యులు సూచించిన మందులను ఆస్తమా రోగులు తప్పకుండా వాడలి. జలుబు, ఫ్లూ వంటి అలర్జీ కారకాలను నియంత్రించుకోవాలి.

- డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, చెస్ట్ ఫిజీషియన్, అశ్విని హాస్పిటల్ కర్నూలు



ఆస్తమా అంటు వ్యాధి కాదు



ఆస్తమా అంటు వ్యాధి కాదు. సరైన అవగాహన, వ్యాధి నిర్ధారణ చికిత్సతో ఆస్తమాను నియంత్రణలో ఉంచవచ్చు. ఆస్తమా గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఏడాది మే మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆస్తమా పెద్దలతో పాటు పిల్లల్లో కూడా ఎక్కువగా వస్తుంది. ఇండియాలో 11 ఏళ్లలోపు చిన్నారుల్లో నూటికి 5 నుంచి 15 మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. - డాక్టర్ కె.సువర్ణలక్ష్మి, పల్మనాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

రాహుల్ గాంధీ పోరాటంతోనే కులగణన

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్

కల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పోరాట ఫలితంగానే కేంద్రం కులగణనకు సిద్ధమైందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్ తెలిపారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో రాహుల్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ దేశంలో 60 శాతం పైగా ఉన్న బీసీల జనాభా లెక్కలు లేకపోవడం శోచనీయమన్నారు. దీనివల్ల విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామనీ, 50 శాతం రిజర్వేషన్ పరిధిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విదంగా కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ రజాక్ వలి, పఠాన్ హబీబ్ ఖాన్, బాలస్వామి, జాకీర్ హుశేన్, చెన్నయ్య పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు

- హైదరాబాద్ జాతీయ రహదారిలో అర్ధరాత్రి కలకలం

కర్నూలు క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): హైడ్రో క్లోరిక్ యాసిడ్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అర్ధరాత్రి హైదరాబాదు జాతీయ రహదారిపై కలకలం రేగింది. నగర శివారులో ఉన్న ఓ ఫ్యాక్టరీ నుంచి రాణిపేటకు హైడ్రో క్లోరిక్ ఆమ్లం లోడ్‌తో వెళ్తున్న ఓ ట్యాంకర్‌ను వెంకటరమణ కాలనీ ఫ్లైఓవర్‌పై ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లో ఉన్న లివర్స్ ఫెయిల్ అయి.. హెచ్‌సీఎల్ ద్రవ పదార్థం మొత్తం లీకైంది. దీంతో జాతీయ రహదారిపై పడిన ఆమ్లం నుంచి ఘాటుతో పొగలు వ్యాపించాయి. దాంతో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ దూరంగా పరారయ్యారు. ఫ్లైఓవర్‌పై నుంచి ద్రవం మొత్తం జారుకుంటూ సంతోష్‌నగర్ దాకా వెళ్లింది. ఈ మొత్తం రోడ్డంతా ఘాటైన వాయువులు వ్యాపించడంతో హైదరాబాదు వైపు నుంచి వచ్చే వాహనాలన్ని నిలిచిపోయాయి. ఒక్కసారిగా వాయువులు వ్యాపించడంతో ప్రమాదకరంగా ఉందని ఆందోళనలు చెందిన స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వాయువు పెద్దగా ప్రమాదం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ ను సర్వీసు రోడ్డుపైనుంచి మళ్లించారు. అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి బాలరాజు ఆధ్వర్యంలో ఓ ఫైరింజన్, సిబ్బంది ఆ యాసిడ్‌పై నీళ్లు చల్లించారు. అలాగే ట్యాంకరులో 36వేల లీటర్ల ఆమ్లం ఉండటంతో ఎట్టి పరిస్థితుల్లో ఆమ్లాన్ని డైల్యూట్ చేయాలి కాబట్టి దాన్ని నేలపైన అన్‌లోడు చేయాలి. దీంతో ట్యాంకర్‌ను ఉలిందకొండ వైపు తీసుకెళ్లి దూపాడు సమీపంలో ఓ గుంతలో పారబోశారు. అంత వరకు ట్యాంకర్ వెంట ఫైరింజన్ వెళ్తూ ఆ వాయువు వ్యాపించకుండా నీళ్లు చల్లుతూ జాగ్రత్తలు తీసుకున్నారు. దూపాడు సమీపంలో ఓ గుంతలో యాసిడ్ ఆమ్లాన్ని కింద పోసి ఆమ్లం డైల్యూట్ అయ్యేంత వరకు నీరు పోశారు. ఆ తర్వాత తిరిగి వెంకటరమణ కాలనీ వైపు వచ్చిన ఫైరింజన్లు వెంకటరమణ కాలనీ వైపు వచ్చి రోడ్డుపై ఉన్న ఆమ్లాన్ని మొత్తాన్ని శుభ్రం చేశారు. ఈ తతంగం సోమవారం ఉదయం వరకు సాగింది. మరో వైపు ఫ్యాక్టరీ యజమాన్యం కూడా ఆమ్లంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దానిపై కొంత పౌడర్ చల్లుతూ చర్యలు తీసుకున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.



ప్రమాదంలో దెబ్బతిన్న ట్యాంకర్

'జొన్న రైతులను ఆదుకోవాలి'



నంద్యాల మున్సిపాలిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): జొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పంట వచ్చిన రెండు నెలల తర్వాత కొనుగోలు నిర్ణయాన్ని ప్రకటించిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవడానికి నెల రోజులు తీసుకోవడం రాయలసీమ రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణం అని అన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా జొన్నలను సేకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోదాములకు తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేయకుండా రోజుల తరబడి నిలిపి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులు గోదాముల దగ్గరే నిద్రాహారాలు మాని కాపలా ఉండాల్సి వస్తోందన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడడంతో పాటు వాహనాల కిరాయి పెరగడం వల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలో ధాన్యాన్ని విజయవంతంగా సేకరిస్తున్న ప్రభుత్వం రాయలసీమలో జొన్నల సేకరణ పట్ల పూర్తిగా ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు.

కాంట్రాక్ట్ ఏఈకి విధులు నిలుపుదల

- ఇన్‌చార్జి డీఈకి షోకాజ్ నోటీసులు

శ్రీశైలం, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో కుర్చీల కొనుగోలులో జరిగిన అక్రమాలపై కాంట్రాక్ట్ ఏఈ భవన్‌కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఈవో శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్ట్ కుర్చీలు నాణ్యతలేనివి కొనుగోలు చేశారని ఆదివారం ఆకస్మిక తనిఖీల్లో గుర్తిస్తూ ఇన్‌చార్జి డీఈ చంద్రశేఖర్‌శాస్త్రికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కలపరిలో అదుపులోకి రాని విషజ్వరాలు

చికిత్స పొందుతూ మరొకరి మృతి

ఆస్పరి, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలపరి గ్రామంలో విషజ్వరం బారిన పడ్డ పెద్ద శేకన్న(48) సోమవారం మృతి చెందారు. శేకన్నకు ఉపిరితిత్తులలో నీరు చేరడంతో కుటుంబ సభ్యులు కర్నూలులో చికిత్స చేయించారు. అయితే కోలుకోలేక మృతిచెందారు. ఇప్పటికే గ్రామంలో విషజ్వరంలో వెంకమ్మ(62) అనే మహిళ మృతిచెందిన విషయం విదితమే. కాగా గ్రామంలో వైద్యాధికారులు వైద్యశిబిరాన్ని తొలగించి, పీహెచ్‌సీకి రావాలని సూచించారు. ఇప్పటికీ ఆరుగురు వరకు బాధితులు ఉన్నారు. విషజ్వరాలు 30 రోజులుగా అదుపులోకి రాకపోవడంతో ఆదోళన కనిపిస్తోంది. అదుపు చేసేందుకు స్థానిక వైద్యులు, కర్నూలు వైద్య సిబ్బంది చికిత్సలు చేసినా అదుపులోకి రాకపోవడంతో గ్రామస్థులు భయపడుతున్నారు. కాగా చికున్‌గన్యా, విష జ్వరాలను అదుపు చేసేందుకు వైద్య పరీక్షలు, రక్త నమూనాలు సేకరించామని పీహెచ్‌సీ వైద్యుడు బాలకృష్ణ తెలిపారు. జ్వరాలు అదుపు కావడానికి సమయం పడుతుం దన్నారు. జ్వరపీడితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరణ ఇచ్చారు.

ఇల్లు రాసివ్వాలని మేనత్తపై కత్తితో దాడి

నంద్యాల టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): మేనత్తపై మేనల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం నంద్యాలలో జరిగింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆత్మకూరు బస్టాండు చెందిన రెహమున్నీసాకు నూనెపల్లెలో రెండు ఇళ్లు ఉన్నాయి. అయితే ఆమె సోదరుడి కుమారుడు అబ్దుల్ రెహమాన్ తనకు తండ్రి లేడని, ఒక ఇంటిని తన పేరు మీద రాసివ్వాలని నిత్యం గొడవ పడేవాడు. అయితే ఆమె స్పందించడం లేదని సోమవారం నూనెపల్లె నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో రైల్వే పోలీసు స్టేషన్ సమీపంలోని నాగుల కట్ట వద్ద కత్తితో దాడి చేయడంతో రెహమున్నీసాకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

వెలుగోడు, మే 5(ఆంధ్రజ్యోతి): వెలుగోడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోని మద్రాస్ కెనాల్ పరిసరాల్లో సోమవారం తెల్లవారుఝామున ఆవుల మందపై పెద్దపులి దాడి చేసింది. పంటపొలాల్లో నిలిచిన శివనాయక్ ఆవుల మందపై పెద్దపులి దాడి చేయడంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. అటవీశాఖ అధికారులు తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు. రేంజర్ ఎంఏ ఖాన్‌ను వివరణ కోరగా.. పెద్దపులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించామని, దాడిలో ఆవు చనిపోయింది వాస్తవమేనని అన్నారు. ఆవు యజమానికి నష్టపరిహారం అందజేస్తామని చెప్పారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కర్నూలు జిల్లా ప్రైవేటు ఐటీఐ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దామోదర చౌదరి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంటు ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐటీఐ.ఏపీ.జీవో వీ.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదోతరగతి పాసైన వారు, ఇంటర్, డిగ్రీ పాసైనా, ఫెయిలైనా వారు కూడా ఇందుకు అర్హులన్నారు. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీప ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ విద్యా సంస్థల్లో సంప్రదించాలని తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

క్షమాపణ చెప్పాలి



బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

బండిఆత్మకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీహెచ్‌వో, ఎంపీహెచ్ఎస్‌లు తక్షణమే క్షమాపణ చెప్పాలని సూపర్‌వైజర్ వెంకట శివన్న, మాధవి డిమాండ్ చేశారు. సోమవారం బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సహచర ఉద్యోగులతో పాటు తాము ప్రజా ఆరోగ్యాలను కాపాడుతున్నామని, ఇలా సహచర సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు.

వడదెబ్బ సోకకుండా చూసుకోవాలి

బండిఆత్మకూరు, మే5 (ఆంధ్రజ్యోతి): ఎండలో పని చేస్తున్న కూలీలు వడ దెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యకాస జిల్లా నాయకుడు డేవిడ్ సూచించారు. సోమవారం మండలంలోని ఏ కోడూరు గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లను ఆయన అందజేశారు.

పాఠశాలల పరిరక్షణ కోసం నిరసన

నంద్యాల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం నంద్యాల పట్టణ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల పరిరక్షణ కోసం ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాల కొనసాగించాలని డిమాండ్ చేశారు. 60 మంది విద్యార్థులు ఉంటే మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేసి పీఎస్‌హెచ్ఎంతో పాటు 5 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. అన్ని పాఠశాలకు హెచ్ఎం, పీడీ పోస్టులను మంజూరు చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించి సబ్జెక్ట్ టీచర్లతో భోధన సాగేలా చేయాలని సూచించారు.

'నియోజకవర్గ కమిటీలను పూర్తి చేయండి'

నంద్యాల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నియోజకవర్గ కేఎస్ఎస్ కమిటీలను మే 18 నాటికి పూర్తి చేయాలని నంద్యాల నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ పోతురాజు రవికుమార్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌తో ఆయన భేటీ అయ్యారు. రవికుమార్ మాట్లాడుతూ ఇప్పటికే దాదాపు 70 శాతం కేఎస్ఎస్ (కుటుంబ సాధికార సారధులు) పూర్తి చేయడం జరిగిందన్నారు. మరో రెండు మూడు రోజుల్లో 100 శాతం పూర్తి చేస్తామని తెలిపారు.

వేసవిలో జాగ్రత్తగా పాటించాలి



జూపాడుబంగ్లాలో జర్నలిస్టులకు టోపీలు అందజేస్తున్న ఎంపీడీవో గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

జూపాడుబంగ్లా, మే 5 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తమ విధినిర్వాహణలో జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో గోపీకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జర్నలిస్టులకు రాయలసీమ జర్నలిస్టు వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ ఆధ్వర్యంలో టోపీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డ బ్ల్యూఎస్ఏఈ నాగేంద్ర, ఏపీఎం అంబమ్మ, హౌసింగ్ ఏఈ జ్యోతి, జూపాడుబంగ్లా మండల జర్నలిస్టులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చేతులు శుభ్రం చేసుకుంటున్న వైద్య,వెలుగు సిబ్బంది

జూపాడుబంగ్లా, మే 5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు రావని హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, వెలుగు సీసీలు జయలక్ష్మీ, గాంధీ అన్నారు. సోమవారం జూపాడుబంగ్లాలోని కాసానగర్‌లో చేతులు పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. వైద్యసిబ్బంది, వెలుగు సిబ్బంది కలిసి మహిళలతో కలిసి చేతులను పరిశుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు నాయక్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రామారావుకు నివాళి



అరుణోదయం రామారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ నాయకులు

నందికొట్కూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): విప్లవ సంస్కృతికోద్యమ యోధుడు రామారావు 6వ వర్ధంతి ఘనంగా జరిగింది. సోమవారం పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో అరుణోదయ రామారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ అరుణోదయ పేరుని తన ఇంటిపేరుగా మార్చుకున్న వ్యక్తి రామారావు అని ఆయన అన్నారు. రామరావు మరణం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని విప్లవ ప్రజా సాంస్కృతిక రంగానికి తీరని లోటు అని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీదు మియా, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు ఎల్లనాయుడు, ఆర్.శివ, పీవైఎల్ జిల్లా నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నంద్యాల టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం రజీయా సుల్తాలా తెలిపారు. ఈనెల 11న పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా బస్సును ఉదయం 7.30 గంటల బస్సు బయల్దేరుతుందన్నారు. రానుపోనూ చార్జీలకు రూ.1750 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.

జాగా కనిపిస్తే వేసేయ్ పాగా



వైఎస్ నగర్‌లో కబ్జా చేసి రాళ్లు పాతిన దృశ్యం



వైఎస్ నగర్‌లో విలువైన స్థలం

నంద్యాల టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో జాగా కనిపిస్తే చాలు అక్రమార్కులు దర్జాగా పాగా వేసేస్తున్నారు. దీంతో రూ. కోట్లు విలువ చేసే పురపాలక స్థలాలు కనుమరుగవుతున్నాయి. నంద్యాల పట్టణంలో సుమారుగా సెంటు స్థలం లక్షల్లో ఉంది. మెయిన్ రోడ్డుకైతే ధర రూ. కోట్లలో పలుకుతోంది. కొందరు నాయకుల పేర్లు చెప్పి కబ్జా చేసి, పెద్దపెద్ద భవనాలు నిర్మించి విక్రయిస్తున్నారు. ఈ విషయం అధికారులు తెలిసినా ఏమి పట్టనట్లు వ్యవహిస్తుండడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

- మున్సిపాలిటీ స్థలాలు కబ్జా
- పట్టించుకోని అధికారులు
- వైఎస్ నగర్‌లో సుమారుగా 3 ఎకరాల భూమి
- పట్టణ నడిబొడ్డులో కాల్వలు సైతం కబ్జా చేసి నిర్మాణాలు
- నేతల అండదండలు ఉన్నాయంటున్న కబ్జా దారులు

నంద్యాల పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. సుమారుగా 3 లక్షల జనాభా ఉంది. కొన్ని ఏళ్ల కిందట కొన్ని గ్రామ పంచాయతీలను కూడా మున్సిపాలిటిటీలో కలిపారు. అప్పటి నుంచి కబ్జాదారులు అక్రమాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కూడా దీనిపై చర్చ జరిగినా పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. అలాగే వీరిపై నాయకులు, స్థానికులు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక రహస్య ఏమిటని చర్చ జరుగుతోంది.



ప్రతాప్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన షెడ్డు

పట్టణంలో కబ్జాకు గురైన కొన్ని స్థలాలు

- వైఎస్ నగర్‌లో సుమారుగా 3 ఎకరాల భూమి ఇటీవల కొందరు నాయకులు కబ్జా చేసి అందులో బంకులు, రేకుల షెడ్డులు వేశారు. ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- నంద్యాల మున్సిపాలిటీ పక్కనే ఉన్న సుమారు 12 సెంట్లు స్థలాన్ని కాల్వ పూడ్చి వారు ఉంటున్న స్థలానికి కలుపేసుకున్నారు.
- బొమ్మల సత్రంలో ఉన్న సుమారుగా 2.5 సెంట్లు పురపాలక సంఘం స్థలాన్ని అక్రమించుకుని ఏకంగా నిర్మాణం చేపట్టి మధ్యలో వదిలేసి ప్రస్తుతం అ బిల్డింగ్‌ను అమ్మకానికి సైతం పెట్టారు.
- జగజ్జననీ నగర్‌లో సుమారుగా 10 సెంట్లు పురపాలక స్థలాన్ని అక్రమించుకుని చుట్టు కంచె వేశారు.
- ఫరూక్ నగర్‌లో ఏకంగా కాల్వలను తన స్థలానికి అనుకుని ఉందని 5 సెంట్ల స్థలాన్ని అక్రమించుకుని ఇంటి నిర్మాణం చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదు.



పురపాలక కార్యాలయం పక్కనే కబ్జాకు గురైన స్థలం

- శ్రీనివాస సెంటర్‌లోని ప్రతాప్ థియేటర్ వద్ద ఉన్న పురపాలక కాంప్లెక్స్ అనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు నాయకుల అండతో మద్యం సిట్టింగ్ రూం ఏర్పాటు చేశారు.
- ఇలా పట్టణంలో రూ. కోట్లు విలువ చేసే స్థలాలు కొందరి అండదండలతో, అధికారుల నిర్లక్ష్యం వల్ల కబ్జాకు గురై మున్సిపాలిటీకి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా

కబ్జాదారులు ఎటువంటి అనుమతులు లేకుండా వారికి నచ్చినట్లు కబ్జా చేసిన అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేసి గాలికి వదిలేస్తున్నారు. కబ్జా దారులకు ఎటువంటి నోటిసులు ఇవ్వకుండానే వారికి ఏమి పట్టనట్టు, అన్ని సక్రమంగా ఉన్నట్టు ఉండిపోతున్నారు. మున్సిపాలిటీ స్థలాల్లో నిర్మాణాలు చేసిన, కాల్వలు పూడ్చి బంకులు, షెడ్డులో వేసిన పట్టించుకోవడం లేదు. అక్రమ నిర్మాణాలను, కబ్జా చేసిన వాటిని కాపాడితే మరి న్ని స్థలాలు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

విచారణ చేసిన చర్యలు తీసుకుంటాం



అక్రమణకు గురైన స్థలాలను గుర్తించి వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయిస్తాం. అధికారులతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరు కూడా మున్సిపాలిటి స్థలాలు కబ్జా చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం.

– వెంకటదాస్, అసిస్టెంట్ కమిషనర్ నంద్యాల

మార్గదర్శుల జాబితాను సిద్ధం చేయండి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శుల జాబితాలను సిద్ధం చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరి హాల్‌లో జేసీ విష్ణుచరణ్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు పీ-4సర్వే ద్వారా మండలాల వారీగా గుర్తించిన 43,021బంగారు కుటుంబాలను దత్తతతీసుకొని చేయూతనిచ్చేందుకు మార్గదర్శకులను గుర్తించాలన్నారు. ఇప్పటివరకు 458మంది మార్గదర్శకులను మాత్రమే గుర్తించారని ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 26,139మంది ఇళ్లులేని నిరుపేదలున్నారని, ఇప్పటివరకు 12651ఇళ్లకు మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశామని, మండలాలవారీగా లబ్ధిదారుల డేటాను తీసుకొని సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికలు, నివేదికలు అందజేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

• 11మంది రైతులకు డీ నోటిపై పత్రాల పంపిణీ

చుక్కల భూములు, 22-ఎ1 భూములు నిషేధిత జాబితాలో ఉండి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 11మంది రైతులకు 32.71ఎకరాల డీ నోటిపై పత్రాలను పంపిణీ చేసినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సంబంధిత రైతులకు కలెక్టర్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఉండే సబ్ యూనిట్ అధికారులు మలేరియాతో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ అన్నారు. సోమవారం నంద్యాలలోని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో సబ్ యూనిట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెక్టార్ కంట్రోల్ హైజిన్ ఏపీటీ, ఏఎన్ఎం లాగిన్‌లో పెండింగ్‌లను క్లియర్‌చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం విధిగా నిర్వహించాలన్నారు. జ్వరం కేసులను త్వరగా గుర్తించి రక్తపరీక్షలు చేయించి మలేరియా నిర్ధారణ అయితే వెంటనే ఏఎల్‌వో, ఫాగింగ్, స్ప్రేయింగ్ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు మండల అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్‌ను వ్యాధి నివారణ చర్యల్లో భాగస్వాములను చేయాలన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డెంగ్యూ, మలేరియా కేసులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ కేసులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి వి.కామేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఏఎంవో ఎస్.రామవిజయారెడ్డి, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సీహెచ్‌వోల నిరసన



ధర్నా చేస్తున్న సీహెచ్‌వోలు

నంద్యాల హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న ధర్నా 6వ రోజుకు చేరింది. సోమవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మెలో భాగంగా సీహెచ్‌వోలు కళ్ల మూసుకొని నిరసన వ్యక్తం చేశారు. విలేజ్‌హెల్త్ క్లినిక్‌లలో గత ఏడేళ్లుగా పంచాయతీ పరిధిలో ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌వో బెనిఫిట్‌ను పునరుద్ధరించాలని, ఎక్స్‌గ్రేషియా పాలసీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్‌ను అమలు చేయాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, ఉపాధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి అఖిల్, భార్గవ్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

కలమందలపాడు చెరువును నింపాలి



చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మిడుతూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలమందలపాడు చెరువుకు హంద్రీనివా సుజల స్రవంతి కాలువ ద్వారా ఒక టీఎంసీతో నింపాలని, అందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కడుమూరు, మిడుతూరు, చెరుకుచెర్ల, భైరాపురం, జలకనూరు, పారుమంచాల, తిమ్మాపురం చెరువులకు సాగునీరు నింపడం వల్ల 20 గ్రామాల్లో 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈయన వెంట తువ్వా చిన్న మల్లా రెడ్డి, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

నంద్యాల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కమ్యూనీటి హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఉప కేంద్రాల్లో బీఎస్సీ నర్సింగ్ పట్టుభద్రులను హెల్త్ ఆఫీసర్లగా నియమించారని ప్రజల ఆరోగ్యం విషయంలో కీలక పాత్ర వహించామని మంత్రికి వివరించారు. ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత లేని నిరాశ గత ప్రభుత్వం ఎదురైందన్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల నూనెపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపుమేరకు సోమవారం నంద్యాల కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఇస్తున్న హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రఘురామమూర్తి, మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ, మున్సిపల్ కాంటాక్ట్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి రంజిత్, ఆర్టీసీ స్వీపర్ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు ఆశీర్వాదమ్మ, మరియమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్

ఆత్మకూరురూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆత్మకూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్ అంబేడ్కర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి ఉపాధి హామీ శ్రామికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయాధికారి మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం కోసం ప్రజలు కోర్టులలో నిర్వహించే లోక్ అదాలత్‌లో వినతి పత్రాలను సమర్పిస్తే వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్క వాహనదారులు ఇన్సురెన్స్‌ను తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అనంతరం కార్మిక చట్టాలు, వారి హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, న్యాయవాది రవి, ఏపీవో మనోహర్ నాగార్జున కార్మికులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా హోమాలు



హోమం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగరేశ్వర సమేత వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సోమవారం హోమాలు నిర్వహించారు. ఉదయం గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణాలు, కలశ స్థాపన, మహన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, జప పారాయణాలు నిర్వహించారు. అలాగే గణపతి హోమం, సుదర్శన హోమం, రుద్రస్వాహాకారాలు నిర్వహించారు. మంగళవారం చండీహోమం జరపనున్నారు. బుధవారం అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయంలో విశేష పూజలను చేపట్టడంతో పాటు అమ్మవారికి గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరహరి సత్యనారాయణ తెలిపారు.

జూదరుల అరెస్టు

బండిఆత్మకూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు, శింగవరం గ్రామాల మధ్య పొలాల్లో పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. సోమవారం పేకాట స్థావరాలపై సిబ్బందితో దాడి చేసి నలుగురి అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7170 నగదు, ప్లేకార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

క్వార్టర్లను పరిశీలించిన మంత్రులు



రెవెన్యూ క్వార్టర్స్‌ను పరిశీలిస్తున్న మంత్రులు ఫరూక్, జనార్దన్‌రెడ్డి

నంద్యాల హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ క్వార్టర్స్‌ను రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో రెవెన్యూ క్వార్టర్స్ విషయంపై మంత్రులు చర్చించారు. శిథిలమైన రెవెన్యూ క్వార్టర్స్ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. వారివెంట ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సర్వజన ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి లక్ష్మణ్, కార్యవర్గసభ్యులు నరసింహులు, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం మాట్లాడుతూ జీజీహెచ్‌లో గత పదిరోజులనుంచి సిటీస్కాన్ పనిచేయకపోయినా పట్టించుకునే నాథుడేలేడన్నారు. దీంతో రోగులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. నంద్యాలలో వెంటిలేటర్‌తో కూడిన 108అంబులెన్స్ సర్వీస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనరిక్ మందుల షాప్‌ను ఆస్పత్రి ఆవరణలోనే ఏర్పాటు చేయాలని, అల్ట్రాసౌండ్ డాక్టర్‌ను వెంటనే నియమించాలన్నారు. రోగులకు స్ట్రైచర్లు, వీల్ చైర్ల కొరతలేకుండా చూడాలన్నారు. ధర్నాలో పట్టణ కమిటీ సభ్యులు మౌలాలి, జైలాన్‌తోపాటు సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పోరాట ఫలితమే కులగణన : కాంగ్రెస్



డోన్‌లో రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డోన్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కులగణన చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం కాంగ్రెస్ పోరాట ఫలితమేనని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. పట్టణంలోని పాతబస్టాండు గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గార్లపాటి మద్దిలేటి మాట్లాడుతూ కులగణన వల్ల దేశంలో అసమానతలు తొలగిపోయి సామాజిక న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గార్లపాటి మద్దిలేటి, నాయకులు మల్లెంపల్లె జనార్దన్, జీవన్‌బాబు, వడ్డె రాజశేఖర్, మధుసూదన్ రెడ్డి, వై.శేఖర్, పఠాన్ హుశేన్ పాల్గొన్నారు.

ఎండ ప్రతాపం

- బయటకు రావాలంటే హడలిపోతున్న ప్రజలు



చాగలమర్రిలో మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన గాంధీబజార్

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): రోజురోజూ ఎండ ప్రతాపం పెరుగుతుండటంతో ప్రజలు హడలిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్ల మీ దకు రావాలంటేనే భయపడు తు న్నారు. ఉదయం, సాయంత్రం పూట మాత్రమే పనులపై బయ టకు వస్తున్నారు. వ్యవసాయ పనులు కూడా ఉదయం 10 నుంచి 11 గంటల లోపే ముగించేస్తున్నారు. పాడి పశువుల్లో కూడా పాల దిగుబడి తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. రెండు రోజుల నుంచి 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకముందు ఎండ వేడిమి ఇంకా ఎక్కువగా ఉంటుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు అయ్యాయి. హైదరాబాదుకు చెందిన రెండు కార్లు నగల్లపాడు సమీపంలో అదుపు తప్పి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అచ్చుతరెడ్డి, శ్రీకాంత్, సరిత, వీరేంద్ర, తేజశ్వణి గాయపడ్డారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీకాంత్, సరిత, తేజశ్వణిని మెరుగైన చికిత్స నిమిత్తం నంద్యాల వైద్యశాలకు తరలించారు. హైదరాబాదు నుంచి కడప వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని మరో వైపు వెళ్తున్న కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కార్లను క్రెన్ సాయంతో తొలగించి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుగూడెం గ్రామం లోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పి.ప్ర సాద్ (60) గుండె పోటుతో సోమవారం మృతి చెందారు. ఎస్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకుడిగా పని చేసి ఉపాధ్యాయ లోకానికి తనదంటూ ఒక చెరగని ముద్ర వేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ అన్నారు. ప్రసాద్ మృతి చెందడం బాధాకరం అన్నారు. ఆయన మృతి పట్ల ఎం పీపీ వీరభద్రుడు, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, సీఆర్పీలు, ఎస్టీయూ, పీఆర్టీయూ, యూటీఎఫ్, టీడీపీ నాయకులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సంతాపం ప్రకటించారు.

పశుగ్రాసం దగ్ధం

రుద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు వరిగడ్డి ట్రాక్టర్‌కు తగులడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన తువ్వపల్లె సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. రెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిన్నిక్రిష్ణయ్య అనే రైతు ట్రాక్టర్‌లో పశుగ్రాసం తరలిస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు వరిగడ్డికి తగిలాయి. దాంతో మంటలు రేగడంతో ట్రాక్టరు డ్రైవరు చాకచక్యంతో ట్రాక్టరు లిఫ్ట్ సహాయంతో పశుగ్రాసాన్ని కింద పడేశాడు. రూ.50వేలు విలువ చేసే పశుగ్రాసం కాలిబూడిదైంది.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

బనగానపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందరోజుల పాటు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు ఉచితంగా ప్రభుత్వం మహిళలకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆళ్లగడ్డలో జాబ్ మేళా

ఆళ్లగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలోని అనంత డిగ్రీ కళా శాలలో సోమవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాకు 14 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. 321 మంది అభ్యర్థులు పాల్గొనగా 152మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు వివరించారు.

డిగ్రీ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంగన్న సోమవారం తెలిపారు. బీకాం, బీఏ, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు. కళాశాలలో ప్రవేశాలు పొందే విద్యార్థులకు హాస్టల్ వసతి ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథలకు దుస్తుల పంపిణీ

డోన్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ దగ్గర ఉంటున్న నిరుపేదలకు ప్రార్థన సమయం నిర్వాహకుడు జానీ ప్రభాకర్ సోమవారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానీ ప్రభాకర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రింద ప్రార్థన సమయం ప్రారంభించి దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అడుగంటిన నీటి నిల్వలు

- అవుకు రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు
- ప్రస్తుతం 1.409 టీఎంసీలే
- ఎస్సార్బీసీ కాలువ నుంచి నిలిచిన నీరు



అవుకు రిజర్వాయర్

అవుకు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్‌లో నీటి నిల్వ అడుగంటి పో తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.148 టీఎంసీలు. ప్రస్తుతం 1.409 టీఎంసీలు మాత్రమే నీరు ఉంది. ఎస్సార్బీసీ కాల్వ నుంచి రిజర్వాయర్‌కు నీరు రావడం నిలిచిపోయింది. మెట్టుపల్లె గ్రామ పరిధిలో ఎస్సార్బీసీ కాల్వ కింద సాగు చేసిన వరిపంట గింజలు పాలు పోసుకొనే దశకు చేరుకున్న తరుణంలో పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రిజర్వాయర్ నుంచి 12ఏ బ్లాక్ (సంగపట్నం) కాల్వ ద్వారా 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీరు అందిస్తున్నారు. లోకల్ ఆయకట్టుకు 60 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. మరోపక్క రిజర్వాయర్ నుంచే కమ్యూనిటీ ప్రాజెక్ట్ వాటర్ సప్లయ్ (సీపీడబ్ల్యూఎస్) పథకం ద్వారా 50 గ్రామాలకు ప్రతిరోజు 40 లక్షల లీటర్లు తాగునీటి ని తర లిస్తున్నారు. అలాగే కొలిమి గుండ్ల సమీపంలో నిర్మించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి రిజర్వాయర్ నుంచి ప్రతిరోజూ 25లక్షల లీటర్లు నీటిని తరలిస్తున్నారు. రిజర్వాయర్‌లో మరింత స్థాయిలో నీరు అడుగంటక ముందే గేరుకల్లు నుంచి నీటిని విడుదల చేసి రిజర్వా యర్‌లో కనీసం రెండు టీఎంసీల నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



డి.వనిపెంటలో నీరు లేక ఒట్టిపోయిన చెరువు

ఒట్టిపోయిన చెరువులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, డి.వనిపెంట, చింతలచెరువు, చిన్న బోధనం గ్రామాల సమీపంలోగల చెరువుల్లో నీరు లేక ఒట్టిపోయాయి. దీంతో రైతులు, మూగజీవాలు, కూలీలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నీటి కోసం మూగజీవాలు అలమటిస్తున్నాయి. పాడి పశువులు దాహం తీర్చేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక వైపు పశుగ్రాసం కొరత, మరో వైపు నీటి కొరత వేధిస్తోంది. కొందరు రైతులు మూగజీవాలను కబేళాకు తరలిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మూగజీవాల దాహం తీర్చేందుకు ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్లను ఏర్పాటు చేసి నీటిని నింపాలని రైతులు కోరుతున్నారు.

శేష వాహనంపై జ్వాలా నారసింహుడు

ఆళ్లగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలో వైశాఖ మాస నృసింహ జయంతి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారికి ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి, మణియర్ సౌమ్య నారాయణ్ ఆధ్వర్యంలో నవ కలశ తిరుమంజనం నిర్వహించారు. అలాగే సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామిని చంద్ర ప్రభ వాహనంపై కొలువుదీర్చారు. మాడా వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. నరసింహ స్వామి జయంతి మహోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రొద్దుటూరుకు చెందిన సీవీ సుబ్బారావు, హైదరాబాద్‌కు చెందిన గోపాలక్రిష్ణ, విజయ లక్ష్మి, అహో బిలానికి చెందిన సెందిల్ రెడ్డి, చిత్రలేఖ ఉభయదారులుగా వ్యవహరిం చారు.



మాడా వీధుల్లో ఉత్సవ మూర్తులను ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

క్రీడాభివృద్ధికి సహకారం: మంత్రి

బనగానపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తామని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. జాతీయస్థాయిలో బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బనగానపల్లె నెహ్రూ ఉన్నతపాఠశాల విద్యార్థి షేక్ సుహాన(8వతరగతి) ను సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుంచి 29 వరకు ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విద్యార్థి రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిథ్యం వహించడం గర్వకారణమన్నారు. సుహాన తల్లిదండ్రులను నెహ్రూస్కూల్ కరస్పాండెంట్ కోడూరు హరినాథరెడ్డిని వ్యాయామ ఉపాధ్యాయులను మంత్రి అభినందించారు. కార్యక్రమలో పాఠశాల డైరక్టర్ కమల్‌తేజారెడ్డి, ఎండీ రవితేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షేక్ సుహానను అభినందిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

బనగానపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(257) సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బనగానపల్లె తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జాకీర్‌హుసేన్, హరి నాథగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో గందరగోళ పరిస్థితులు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల పాఠశాల విద్యకు నష్టం కలుగుతుందన్నారు. ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ఒక్కొక్క రకమైన విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. 1నుంచి 5వ తరగతి వరకు మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలన్నారు. 6,7 తరగతులు ఉన్న చోట నాలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను 6,78, తరగతులు ఉన్న చోట 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నతపాఠశాలకు ఒక హెచ్‌ఎం, ఒక వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రామ కృష్ణ, రంగనాయకులు, ఓబయ్య, సురేశ్, మధు, రాజేశ్‌గౌడ్, చంద్రశేకర్, విశ్వనాథ్, చంద్రమోహన్‌రెడ్డి, ఎల్లాసుబ్బ, జమాల్, ఇబ్రహీం పాల్గొన్నారు.

'న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి'

బనగానపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని నేషనల్‌మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట డిపో కార్యదర్శి శ్రీనివాసు లు, ప్రెసిడెంట్ జమ్మలయ్య ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చే శారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగభద్రత కల్పించాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపు ఆపివేయాలని, పదోన్నతులు కల్పించాలని, పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో గఫార్, ఎల్లయ్య, ఓబులేసు, ప్రహ్లాద, అధిక సంఖ్యలో బనగానపల్లె ఆర్టీసీ డిపో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

కోవెలకుంట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవీ పర మేశ్వరీ అమ్మవారి వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా రెండోరోజు సోమ వారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, గ్రామోత్సవం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సతీష్‌శర్మ పర్యవేక్షణలో అత్యంత వైభవంగా నిర్వహిం చారు. ఉదయం 5గంటలకు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి మూల విరాట్ అమ్మవారికి అభిషేకం, నిజపాద దర్శనం చేశారు. సాయం త్రం 5గంటలకు రుద్రక్రమార్చన, రుద్రశత, దేవీ ఖడ్గమాల పారా యణములు, తీర్థ ప్రసాద వితరణ గావించారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పెండేకంటి సుబ్రహ్మణ్యం దంపతు లు, పెండేకంటి నాగరాజు, కాల్వ శివనాగయ్య, కాల్వ నాగేశ్వర్‌రావు, కర్నాటి అభిలాష్, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల కంపలను వెంటనే తొలగించాలి

బేతంచెర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామిక కేంద్రమైన బేతంచర్లలోని ఖాళీ స్థలాల యజమానులు పిచ్చి మొక్కలు, ముళ్ల కంప లను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ సోమవా రం తెలిపారు. ఒకవేళ తొలగించని పక్షంలో పురపాలక చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

బనగానపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భానుముక్కల లోని కొండపేట బ్రిడ్జి వద్ద ఉన్న సంపును మంగళవారం పరిశుభ్రం చేయనున్న ట్లు ఈవో సతీశ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు వరకు నీటి సరఫరాను నాయక్‌వాడి మసీదు ఏరియా, కొండపేట బ్రిడ్జి వద్ద ఉన్న శివాలయం, సుంకులమ్మ గుడి ఏరియా, నాలుగుస్తంభాల మసీదు ఏరియా, పెద్దపీ ర్లచావిడి ఏరియా, కొండపేట దళితవాడ, అమ్మవారిశాల, పింజరిపేట, చాకలిపేటలో తాత్కాలికంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దన్నారు. ఈప్రాంతాల్లో సాయంత్రం 3 గంటల తర్వాత నీటి సరఫరా యథావిధిగా సాగుతుందని ఈవో తెలిపారు.

పొలం విషయంలో ఘర్షణ

కోవెలకుంట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయంలో ఘర్షణ పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సంతపేటకు చెందిన పెద్దశివారెడ్డి పొలం పక్కనే పుల్లయ్యకు పొలం ఉంది. అయితే శి వారెడ్డి తన పొలాన్ని వేరొకరికి విక్రయించాడు. ఇది మనసులో పెట్టుకుని పుల్లయ్య అతడి భార్య దస్తరిగమ్మ కలిసి సోమవారం పెద్దశివారెడ్డిపై దాడి చేశారు. శివారెడ్డికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. బాధి తుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెద్దకంబలూరులో బందోబస్తు ఏర్పాటు

రుద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకంబలూరులో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు శిరివెళ్ల సీఐ దస్తగిరిబాబు తెలిపారు. గ్రామంలో రమేశ్ (25) అనే వ్యక్తి ఆదివారం రాత్రి హత్యకు గురైన విష యం విదితమే. సోమవారం సీఐ దస్తగిరిబాబు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించామన్నారు. రమేశ్ హత్య కేసులో మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు అశోక్, పాములేటి అనే వారితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ దస్తగిరిబాబు తెలిపా రు. ఎస్ఐలు వర ప్రసాద్, చిన్న పీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భవనంలో ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీఖానా పక్కన ఉన్న నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం సీపీఐ కార్యవర్గ సభ్యులు సుంకయ్య, మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోట రాముడు, సహాయ కార్యదర్శి ఎన్‌కే రామ్మోహన్ కలిసి సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాదీఖానా దగ్గర నూతనంగా నిర్మించిన భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే ప్రజలకు అనుకూలంగా, సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఓబులాపురం జయరాముడు, రామకృష్ణ, రాముడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

బేతంచెర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, రోగులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సభ్యులు యుగంధర్ రెడ్డి, సుమిత్రల సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుదాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు వలిబాషా, సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో వేసవి శిక్షణ ప్రారంభం

ఆళ్లగడ్డ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలో ఆర్ఆర్ స్పోర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో క్రీడాకారులకు సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్య ఉద్యోగాలు ఎన్నో అవకాశాలు వస్తా యన్నారు. క్రీడాకారులకు తాము అండగా ఉంటామని అన్నారు. ఆళ్లగడ్డకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగిన వారు ఉన్నారని వారందరికీ అభినందనలు అన్నారు. కోచ్ సుబ్బారా యుడు మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంప్ జూన్ 10వరకు కొనసాగుతుందన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

కోవెలకుంట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య, సబ్ కమిటీ సభ్యులు మధు, దస్తగిరి, బాషా, అలీహుసేన్ అన్నారు. సోమవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ముందు నాయ కులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో డి.శ్రీనివాస్, వేద వ్యాస్, అమీర్‌బాషా, సతీష్‌కుమార్, శివశంకర్, సురేశ్, నాగేశ్వర్‌రావు, హరీష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈనెల 7నుంచి ప్రారంభం కానున్న పాండురంగ విఠలేశ్వర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయకమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య అన్నారు. సోమవారం ఆయన పాండురంగస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుతో భరోసా

బేతంచెర్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కార్డు కార్యకర్తల కుటుంబానికి ఒక భరోసా అని టీడీపీ సీనియర్ నాయకుడు పోలూరు శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం బలపాలపల్లెలో ఆంజనేయస్వామి దేవాలయం వద్ద టీడీపీనాయకులు ఆర్.ఈశ్వరయ్య అధ్యక్షతన 226, 227 బూత్‌లలో టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలూరు నారాయణ, కోటయ్య, ముద్దవరం శేఖర్, గంగాధర్, సంకటి ఏకాంబరం, ఉన్నం శేఖర్, తిరుమలేష్, డి.మద్దిలేటి స్వామి, విష్ణు, డి.పౌలయ్య, సుదాకర్, ఆర్.రాజు పాల్గొన్నారు.

కనపకుంటలో మద్దిలేటి స్వామి తిరునాళ్లు

డోన్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపకుంట గ్రామంలో ఈ నెల 10,11 తేదీల్లో లక్ష్మీమద్దిలేటి స్వామి తిరునాళ్ల మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 10న గ్రామంలో అంతరాష్ట్ర న్యూకేటగిరి విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విజేతకు రూ.60వేలు, అలాగే వరుసగా రూ.40వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. 11న పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి నుంచి వరుసుగా మూడు బహుమతులు రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ హాజరవుతున్నట్లు తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్యాపిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఓ బాలిక తండ్రిని హత్య చేసిన నిందితుడు అనిల్ కుమార్‌ను కఠినంగా శిక్షించాలని ఆవాజ్ కమిటీ డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు జలదుర్గం రసూల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జలదుర్గం గ్రామంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు రహిమాన్, అక్బర్‌బాషా, మజీద్, జమాల్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

ప్యాపిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్ అన్నారు. సోమవారం మండలంలోని జలదుర్గం గ్రామంలో అంతర్జాతీయ కార్మిక వారోత్సవాలను పురస్కరించుకొని సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రహిమాన్ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చిన కార్మికులు సంఘటితం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, గంగాధర్, నబీరసూల్ పాల్గొన్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా

ప్యాపిలి, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమ్మవారిశాల, అగ్రహారం వీధి ప్రాంతంలోని మెయిన్ బజారులో మూడు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారుల స్పందించి వెంటనే నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను వివరణ కోర గా సీపీడబ్ల్యూ స్కీం సంబంధించిన పైపులైన్ లీకేజీ అవడం వలన నీరు సరఫరా కావడం లేదన్నారు. రెండు రోజుల్లో నీరు అందిస్తామన్నారు.

ఆంజనేయస్వామి జెండాలు పంపిణీ

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 6, 7 తేదీల్లో జరుగనున్న పెద్దమ్మతల్లి దేవర సందర్భంగా సోమవారం ఆంజనేయస్వామి పతకాలను హిందూ సంఘ ప్రతినిధి సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. హిందూ సంఘ సభ్యులు ఇంటింటికి వెళ్లి పతకాలను అందజేశారు. కార్యక్రమంలో హిందూ సంఘ సభ్యులు శ్రీనివాసులు, పరమేశ్వర్‌రెడ్డి, హనుమంతు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏఈలు కొండారెడ్డి, నరసింహారావు, రమణయ్య, ఏవో రంగనేతాజీ, ఏపీఎం నాగమ్మ, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, సూపర్‌వైజర్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

12నుంచి మారెమ్మ జాతర

రుద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో ఈ నెల 12, 13 తేదీల్లో మారెమ్మ అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్థులు సోమవారం తెలిపారు. జాతర సందర్భంగా కోలాటం, చెక్కభజన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి జాతరను జయప్రదం చేయాలని కోరారు. అలాగే ఈ నెల 14న న్యూ కేటగిరి విభాగంలో వృషభరాజముల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భూ రీసర్వే పకడ్బందీగా చేయండి

రుద్రవరం, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూరీసర్వే పకడ్బందీగా చేయాలని తహసీల్దారు మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. బీరువోలు గ్రామంలో రీసర్వే పూర్తయింది. సర్వేనెంబర్లవారీగా ఆన్‌లైన్‌లో పకడ్బందీగా చేయాలన్నారు. రెండో విడత కొండమాయపల్లె, నాగులవరం గ్రామాల్లో ప్రారంభమైందన్నారు.

డ్రాపౌట్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే

చాగలమర్రి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రాపౌట్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే వేగవంతం చేయాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 650మంది డ్రాపౌట్‌లను గుర్తించామన్నారు. సీఆర్పీలు, ఐఈ ఆర్టీలు, పీఆర్టీలు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో చర్చించి పిల్లలను బడిలో చేర్పించేందుకు సర్వే చేస్తున్నారని అన్నారు.